క్లుప్తంగా

ఇళ్ల స్థల పట్టాల పంపిణీ



కాశీ కాలనీలో ఇంటి పట్టా అందజేస్తున్న నాయకులు రాంబాబు, వేదకుమారి

దెందులూరు: దెందులూరు కాశీకాలనీలో గురువారం 111 మందికి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాల మేరకు ఇళ్ల స్థల పట్టాలను వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు పోకల రాంబాబు, విజయవాడ కనక దుర్గమ్మవారి ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు తొత్తడి వేదకుమారి, పార్టీ జిల్లా కార్యదర్శులు కట్టా ఏసుబాబు, చల్లా మేరిరాజు, నాయకులు ఐనంపూడి రాము, తొత్తడి కృష్ణ పంపిణీ చేశారు. కాశీ కాలనీ వాసుల ఇబ్బందులను నాయకులు, పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిష్కరించడంతో ఎమ్మెల్యేకు కాశీ కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

సత్యనారాయణ స్వామి వ్రతాలు



పోతునూరు రామాలయంలో వ్రత పూజలు చేస్తున్న దంపతులు

దెందులూరు: మండలంలోని పోతునూరు రామాలయంలో సామూహిక శ్రీ రమా సత్య నారాయణస్వామి వ్రతాలను భక్తులు గురువారం ఆచరించారు. బెజవాడ సత్యవరప్రసాద్, పద్మ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 18 మంది దంపతులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. వేదపండితులు వ్రత విశిష్టతను వివరించారు.

చిన్నఅసిరమ్మ తల్లికి ఘటాల సమర్పణ



ఆలయానికి ఘటాలను తీసుకెళ్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, తెల్లం రాజ్యలక్ష్మి

పెదపాడు : మండలంలోని సత్యవోలు గ్రామంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు భార్య రాజ్యలక్ష్మి గురువారం చిన్నఅసిరమ్మ తల్లికి ఘటాలను సమర్పించారు. గంటా వారి ఆరాధ్యదైవమైన చిన్నఅసిరమ్మ తల్లికి ఘటాలను పద్మశ్రీ, రాజ్యలక్ష్మిలు తలపై పెట్టుకుని చైర్‌పర్సన్ నివాసం నుంచి ఆలయానికి తీసుకెళ్లి మొక్కు చెల్లించుకున్నారు. పద్మశ్రీ దంపతులు, ఎమ్మెల్యే బాలరాజు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సత్యవోలు గ్రామ మహిళలు పాల్గొన్నారు.

లాభాల బాటలో గోగుంట సొసైటీ



సభలో మాట్లాడుతున్న గోగుంట సొసైటీ చైర్మన్ సత్యనారాయణ

పెదపాడు : ఈఏడాది గోగుంట సొసైటీ రూ.1.50 కోట్ల నికర ఆదాయం ఆర్జించే దిశగా వ్యాపారం సాగిస్తోందని గోగుంట సొసైటీ చైర్మన్ బావరాజు సత్యనారాయణ తెలిపారు. పెదపాడు మండలం గోగుంట సొసైటీ వద్ద గురువారం నిర్వహించిన మహాజన సభలో ఆయన మాట్లాడారు. గతేడాది వ్యాపారంలో రూ.1.19 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. ఈ ఆదాయం ద్వారా షేర్ హోల్డర్స్‌కు 18 శాతం డివిడెండ్ రూపంలో అందించామని తెలిపారు. 2024-25 సంవత్సరానికి అంచనా బడ్జెట్‌ను చదివి వినిపించారు. కార్యక్రమంలో సంఘ డైరెక్టరు వల్లూరు శ్రీనివాసరావు, తుమ్మల గోపాలకృష్ణ, మాజీ అధ్యక్షుడు ఎంవీఎస్ కుటుంబశాస్త్రి, సంఘ కార్యదర్శి జయమంగళ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగన్‌కు అండగా నిలుద్దాం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): త్వరలో జరిగే అవినీతికి, అభివృద్ధికి మధ్య యుద్ధంలో రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తోన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెరుగైన సమాజం అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెడ్డి సంఘం కార్యదర్శి గుడిమెట్ల శ్రీనివాస్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఒకే ఒక్కడిగా జగన్ పేద, మధ్య తరగతి కుటుంబాలకు తనవల్ల మేలు జరిగితేనే తన పక్కన నిలబడండి అని కోరడంలోనే ఆయన నిజాయితీ కనపిస్తోందని చెప్పారు. నీచ రాజకీయాలకు, దిగజారుడుతనానికి వత్తాసు పలికే కొన్ని రాజకీయ పార్టీలు షర్మిలను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకురావడం, రాష్ట్రాన్ని అన్యాయంగా విడగొట్టిన కాంగ్రెస్ తరపున ఆమెను రాష్ట్రంలో అన్నకు వ్యతిరేకంగా పని చేయించడం దురదృష్టకరమని పేర్కొన్నారు.

సీఎం జగన్ రుణం తీర్చుకోండి



ఆసరా సభలో మాట్లాడుతున్న వాసుబాబు



సభలో పాల్గొన్న మహిళలు

ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: డ్వాక్రా మహిళలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోవాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మండలంలోని కైకరంలో గురువారం వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో భాగంగా డ్వాక్రా మహిళలకు నాలుగో విడత రుణమాఫీ చెక్కును అందించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాజీ సీఎం చంద్రబాబునాయుడు డ్వాక్రామహిళల రుణమాఫీ చేస్తామని చెప్పి, చివర్లో పసుపు-కుంకుమ పేరుతో మహిళలను మోసం చేశారని మండిపడ్డారు. కానీ తర్వాత వచ్చిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాలుగు దఫాలుగా డ్వాక్రా రుణమాఫీ చేస్తామని చెప్పి, ఇచ్చిన మాటను నిలబెట్టుకుందని తెలిపారు. సమావేశంలో కైకరం గ్రామానికి చెందిన డ్వాక్రా 206 సంఘాలకు రూ.2.37 కోట్లు చెక్కులను, ఎ.గోకవరం గ్రామానికి చెందిన 66 సంఘాలకు రూ.93.76 లక్షలు చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. వైకేపీ ఏపీఓ పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో జెడ్పీటీసీ సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు మరడ మంగరావు, ఎంపీపీ గంటాశ్రీలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ మరడ రమావతి, ఎ.గోకవరం సర్పంచ్ మిద్దే సత్యవతి, ఎంపీటీసీ సభ్యురాలు విజయ నిర్మల, కైకరం ఎంపీటీసీ సభ్యులు పంతులు వెంకన్న, పెద్ద అప్పన్న , వైఎస్సార్ పంచాయితీరాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాలగోపి, సొసైటీ అధ్యక్షుడు యెలిశెట్టి పాపారావుబాబ్జి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ బీఎల్‌ఓగా వీఆర్వో భాస్కర్



గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వీఆర్వో భాస్కర్

ఉంగుటూరు: రాష్ట్ర ఉత్తమ బూత్ లెవిల్ అధికారిగా ఎ.గోకవరం వీఆర్వో భాస్కర్ గురువారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా మెమెంటో, సర్టిఫికెట్ అందుకున్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో 14వ జాతీయ ఓటర్లు దినోత్సవం సందర్భంగా సర్టిఫికెట్‌తో పాటు రూ.10 వేల నగదు బహుమతి అందుకున్నారు. భాస్కర్ ఎ.గోకవరంలోని పీఎస్ నంబర్ 9లో పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా భాస్కర్‌ని పలువురు అభినందించారు.

'దెందులూరు'లో 13,208 ఇళ్ల స్థలాల పంపిణీ

- ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి
- అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు



పెదపాడులో ప్రజలతో మమేకమైన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్యే బాలరాజు దంపతులు

పెదపాడు : దెందులూరు నియోజకవర్గంలో నాలుగన్నరేళ్లలో 13,208 మందికి ఇళ్ల స్థలాలు అందించినట్టు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. పెదపాడు గ్రామంలో బుధవారం నాయన ప్రజా ఆశీర్వాదయాత్ర నిర్వహించారు. రూ.23 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. గాంధీ వనం వద్ద బోర్‌వెల్‌ను ప్రారంభించారు. రూ.9 లక్షల జెడ్పీ నిధులతో డ్రెయినేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ యాత్రలో పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా అబ్బయ్యచౌదరి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో స్థలాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని, వారందరికీ ఇళ్ల పట్టాలు అందించామని, ఇంటి రుణ బకాయిలు చెల్లించామని వివరించారు. నియోజకవర్గంలో 178 కాలనీల నిర్మాణం చేపట్టామని చెప్పారు. పెదపాడులో మైక్రో ఫిల్టర్ ఏర్పాటు చేశామన్నారు. ఇళ్ల స్థలాలు అందించాలని, రుణాలు అందించాలని, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టాలని, సీఎంఆర్ఎఫ్ ఇప్పించాలని, ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు అందించాలని ప్రజలు కోరడంతో ఈ సమస్యలకు పరిష్కారం చూపాలని అక్కడే ఉన్న సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశాలిచ్చారు. డ్రెయిన్ల నిర్మాణానికి అంచనాలు వేయాలని సూచించారు. శ్మశాన వాటిక అభివృద్ధి చేయాలని, కమ్యూనిటీ హాలు నిర్మించాలని ప్రజలు కోరడంతో ఎంపీపీ గ్రాంటు రూ.5 లక్షలు, జెడ్పీ నిధులు రూ.5 లక్షలతో నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అర్హులకు పింఛను మంజూరు చేయించాలని వెల్ఫేర్ అసిస్టెంట్‌కు సూచించారు. తొలుత వలంటీర్లతో సమావేశం నిర్వహించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వడ్డి కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవకుమార్, పెదపాడు సర్పంచ్ కొత్తూరి జీవనకుమారి, సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, ఏఎంసీ అధ్యక్షుడు అప్పన ప్రసాద్, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, బీసీ సెల్ అధ్యక్షుడు, నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్ చౌదరి, పార్టీ దెందులూరు మండల కన్వీనర్ కామిరెడ్డి నాని, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ అక్కినేని గోపి, విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు కత్తుల రవికుమార్, వైస్ ఎంపీపీ రెడ్డి స్వర్ణకుమారి, ఎంపీటీసీ కర్రె మరియమ్మ, సీనియర్ నాయకుడు గారపాటి భాస్కరరావు, అక్కినేని లక్ష్మీనారాయణ, కట్నేని తులసీరామ్, పెనుమత్స శ్రీనివాసరాజు, ఉపసర్పంచ్ చేపేని కృష్ణ, కొత్తూరు విమలారావు, రెళ్ల రమణ, గుణుపూరు మహేష్, బెజవాడ శేఖర్, ఇల్లూరి విజయ్ కుమార్, ఘంటసాల మోషే, మారుమూడి కృషామణి, సిద్ధాబత్తిన జోజమ్మ, కంభంపాటి సుబ్రహ్మణ్యం, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్ర'



నియోజకవర్గ స్థాయి పోటీల్లో ఫైనల్‌కు చేరిన ఉంగుటూరు జట్టు

భీమడోలు: ఉంగుటూరు నియోజకవర్గ స్థాయిలో గురువారం జరగాల్సిన క్రికెట్ మ్యాచ్‌ల్లో సాంకేతిక ఇబ్బందులు నెలకొన్న తరుణంలో గణపవరం, భీమడోలు జట్లు వెనుక తిరిగాయి. ఉంగుటూరు, నిడమర్రు టీములు ఫైనల్‌కు చేరుకున్నాయి. భీమడోలు జెడ్పీ ప్రాంగణంలో ఉదయం ఉంగుటూరు, గణపవరం మండలాల టీములకు గాను, మధ్యాహ్నం భీమడోలు, నిడమర్రు మండలాల టీములకు పోటీ జరగాల్సి ఉంది. అయితే రిజిస్ట్రేషన్ చేయించుకున్న క్రీడాకారులు అందుబాటులో లేకపోవడం, ఇతర సాంకేతిక కారణాల రీత్యా గణపవరం, భీమడోలు టీములు బరిలోకి దిగేందుకు నిబంధనలు అడ్డు వచ్చాయి. ఉంగుటూరు, నిడమర్రు టీములు ఫైనల్‌లోకి చేరుకున్నాయి. అదే విధంగా మహిళల క్రికెట్ మ్యాచ్‌లోను ఇలాంటి పరిణామాలు ఎదురయ్యాయి. దీంతో వారిని వెనక్కి పంపారు.

ఓటు అడిగే హక్కు వైఎస్సార్ సీపీకే ఉంది



వైఎస్సార్ సీపీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: ప్రజలకు సంక్షేమ పాలన అందించిన వైఎస్సార్ సీపీకే రానున్న ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు ఉందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మండలంలోని కైకరంలోని వనజర్ల ఫంక్షన్ హాలులో గురువారం వైఎస్సార్ సీపీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ మనలో ఉన్న చిన్నచిన్న మనస్పర్థలు పక్కన పెట్టాలని సూచించారు. గతంలో ఏ ప్రభుత్వంలో అందించలేని పారదర్శక పాలన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారన్నారు. నియోజకవర్గంలో రూ.2000 కోట్లు పైనే చేసిన అభివృద్ధిని వాసుబాబు వివరించారు. ఈ నెల 30న ఏలూరులో నిర్వహించే ఎన్నిక సన్నాహక సమావేశంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారని, ఈ సమావేశానికి నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మరడ మంగరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి, సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జి, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మెన్ మరడ రమావతి, వైస్ ఎంపీపీ సింగిరెడ్డి సూర్యనారాయణ, గంటా లక్ష్మణరావు, బళ్ల త్రిమూర్తులు, పంతులు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఇంటిలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

ఇద్దరు విద్యార్థులకు స్వల్ప గాయాలు



ఇంట్లోకి దూసుకువెళ్లిన సిద్ధార్థ విద్యాలయ బస్సు

పెదపాడు : స్కూల్ బస్సుకు సైకిలిస్ట్ అడ్డురావడంతో రహదారి పక్కనే ఉన్న ఇంట్లోకి దూసుకెళ్లిన ఘటన పెదపాడు మండలం వసంతవాడ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం వసంతవాడ నుంచి పంచాయతీ కార్యాలయం వైపునకు వెళుతున్న ఓ ప్రైవేటు స్కూల్ బస్సును అడ్డుగా వచ్చిన ఓ సైకిలిస్టును తప్పించేందుకు డ్రైవర్ ప్రయత్నించడంతో అదుపు తప్పింది. రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఫణి నివాసంలోకి దూసుకెళ్లింది. బస్సులో ఉన్న ఇద్దరు చిన్నారులకు స్వల్ప గాయాలైనట్టు స్థానికులు తెలిపారు.

సీఎం జగన్‌తోనే పేదలకు మేలు



బాలగంగాధర్ తిలక్ స్కూల్లో ట్యాబ్‌లు పంపిణీ చేసిన పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి

ఏలూరు టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టారని, నాడు - నేడు పథకంలో ప్రభుత్వ బడులను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్ది అత్యున్నత ప్రమాణాలతో విద్యార్థులకు విద్యను అందించేలా చర్యలు చేపట్టారని రాష్ట్ర సాహిత్య అకాడమి చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి అన్నారు. ఏలూరు 7వ డివిజన్‌లోని బాలగంగాధర్ తిలక్ నగరపాలక పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు, 10వ తరగతి విద్యార్థులకు విజయకేతనం పుస్తకాలను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ టీడీపీ హయాంలో ప్రభుత్వరంగ విద్య నిర్వీర్యమైందని, ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలను చంద్రబాబు ప్రోత్సహించారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు నాడు కనీసం పిల్లలకు పుస్తకాలు, యూనిఫామ్ ఇచ్చే పరిస్థితి లేదన్నారు. నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాలలు తెరిచే నాటికే జగనన్న విద్యాకానుక రూపంలో పుస్తకాలు, బ్యాగ్, షూస్, టై అన్ని అందజేసి పేద విద్యార్థుల ముఖాల్లో సంతోషాన్ని చూస్తున్నారని చెప్పారు. నేడు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, తరగతి గదులు, డిజిటల్ విద్య, అందుబాటులో వచ్చిందని తెలిపారు. సంపన్న వర్గాలకే పరిమితమైన నాణ్యమైన విద్యను పేదల చెంతకు చేర్చారని వివరించారు.

రేషన్ కార్డుల పంపిణీ

ఏలూరు 7వ డివిజన్ సచివాలయంలో కొత్తగా మంజూరైన రేషన్ కార్డులను రాష్ట్ర సాహిత్య అకాడమి చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో కొత్తగా రేషన్‌కార్డులు తీసుకోవాలంటే రెవెన్యూ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సివచ్చేదని, ఒక్కోసారి తిరిగినా రాకపోవడంతో పేదలు చేసేదేమీ లేక మిన్నకుండేవారని గుర్తుచేశారు. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న వెంటనే రేషన్‌కార్డులు, ఇళ్లు, పెన్షన్లు, ఇలా అన్ని సేవలు సకాలంలో అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమాల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు షఫ్రక్, ఉపాధ్యాయులు కొల్లిపర భగవాన్, శివమ్మ, మరియమ్మ, రాము, రఫీ, షమ్మి, మహేష్ తదితరులున్నారు.

ఈవీఎంల పరిశీలన

ఏలూరు(మెట్రో) : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గోదావరి సమావేశపు హాలు వద్ద ఏర్పాటుచేసిన ఎన్నికల సహాయ కేంద్రం, మోడల్ పోలింగ్ కేంద్రాలను గురువారం జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఎన్నికల సహాయ కేంద్రం వద్ద ఓటరు నమోదుకు నిర్దేశించిన ఫారం-6, మార్పులు, చేర్పులకు సంబంధించి ఫారం-7, ఫారం-8లను పరిశీలించి వాటి నింపే విధానం గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మోడల్ పోలింగ్ కేంద్రంలోని ఈవీఎం, ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌లను జాయింట్ కలెక్టర్ కలెక్టర్, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు.

ఘనంగా ఓటర్ల దినోత్సవం



దెందులూరు: ఓటర్ల అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



దెందులూరు: గోపన్నపాలెంలో సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న సర్పంచ్ నాగమల్లేశ్వరి కుమార్



ఉంగుటూరు: సీనియర్ ఓటర్లును సత్కరిస్తున్న అధికారులు



భీమడోలు: సీనియర్ సిటిజన్లును సత్కరిస్తున్న తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ

దెందులూరు: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని దెందులూరులో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈఆర్ఓ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ, తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య ఆధ్వర్యంలో స్థానిక 9వ వార్డు సెంటరులో పాఠశాలల విద్యార్థులు, సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ సిబ్బంది మానవహారం నిర్వహించారు. ఓటు విలువ, ప్రాధాన్యతపై సత్యనారాయణ అవగాహన కల్పించారు. ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలన్నారు.

సీనియర్ ఓటర్లకు సన్మానం

గోపన్నపాలెం సచివాలయంలో సీనియర్ ఓటర్లను గ్రామ సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఏనుగు రామాంజనేయులు, ఎంపీటీసీలు సువ్వా ప్రభుదాసు, ఏనుగు అంజలి ప్రసాద్ సత్కరించారు. నూతన ఓటర్లకు గుర్తింపు కార్డులు అందజేశారు. తొలుత తహసీల్దార్ నాంచారయ్య ఆధ్వర్యంలో దెందులూరు హైస్కూల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లను మండల ప్రత్యేకాధికారి కృపావరం అందజేశారు.

ఉంగుటూరులో..

ఉంగుటూరు: ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఉంగుటూరు ఎంపీడీఓ ప్రేమాన్విత అన్నారు. గురువారం గ్రామం నిర్వహించిన జాతీయ ఓటర్లు దినోత్సవంలో ఆమె మాట్లాడుతూ యువ ఓటర్లు విధిగా ఓటు వేయాలన్నారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటర్లను సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు బొడ్డేపల్లి ప్రసాదు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ పోతురాజు, సీనియర్ సహాయకుడు సాయిరమేష్ పాల్గొన్నారు. ఉప్పాకపాడు ఫౌండేషన్ ప్లస్ పాఠశాల పోలింగు కేంద్రం వద్ద బూత్ లెవెల్ ఆఫీసర్లు వెంకటరమణ, వీఆర్ఓ ఝాన్సీ ఆధ్వర్యంలో ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు.

భీమడోలులో..

భీమడోలు: ఓటు హక్కు వజ్రాయుధమని భీమడోలు తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ అన్నారు. గురువారం 53 పోలింగ్ బూత్‌ల వారీగా అవగాహన సదస్సులను నిర్వహించారు. ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. పలు చోట్ల ముగ్గుల పోటీలను నిర్వహించారు. భీమడోలు నెం.4 పాఠశాలలోని పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలవ్యాప్తంగా 52,518 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. అనంతరం సీనియర్ ఓటర్లను, వికలాంగ ఓటర్లను ఘనంగా సత్కరించారు. పోలసానిపల్లి వీఆర్ఓ డి.సింహాచలం ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలలు, గురుకుల బాలికల కళాశాల్లో బూత్ లెవెల్ అధికారులు, సచివాలయాల సిబ్బంది, యువతతో ప్రతిజ్ఞ చేయించారు. పాతూరు పాఠశాలలో హెచ్ఎం నిర్మలకుమారి ఆధ్వర్యంలో టీచర్ మండే సుధాకర్ విద్యార్థులు, గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ చిన్నారులతో ప్రతిజ్ఞ చేయించి ఓటు విలువను వివరించారు.

11న పెదతాడేపల్లిలో బీసీల బహిరంగ సభ



బీసీ బహిరంగ సభ కరపత్రం ఆవిష్కరించిన దృశ్యం

ఏలూరు (టూటౌన్) : బీసీల హక్కుల సాధన కోసం వచ్చే నెల 11వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు తాడేపల్లిగూడెం సమీపంలోని పెదతాడేపల్లిలో బీసీల బహిరంగ సభ నిర్వహించనున్నట్టు బీసీ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్ తెలిపారు. స్థానిక జిల్లా యాదవ సంఘం కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. దేశంలో నిర్వహించే జనగణనలో సమగ్ర కులగణన చేపట్టాలని, చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు, మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోటా కేటాయించాలని కోరారు. బీసీ ఉద్యోగుల ప్రమోషన్లలో రిజర్వేషన్లు, బీసీ సబ్‌ప్లాన్, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు, ఏ, బీ, సీ, డీల వర్గీకరణ, కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని అన్నారు. బీసీలకు క్రీమీలేయర్, బీసీల అట్రాసిటీ యాక్ట్ ప్రవేశ పెట్టాలని కోరారు. రెండేళ్ల నుంచి బీసీల హక్కుల సాధనకు బీసీ చైతన్య వేదిక ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించామన్నారు. బీసీల బహిరంగ సభకు మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, బీసీ ప్రజాప్రతినిధులు, అన్ని పార్టీల్లోని బీసీ నాయకులు, రాష్ట్రంలోని పలు బీసీ సంఘాల నాయకులు పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా బీసీ బహిరంగ సభకు సంబంధించిన కరపత్రం విడుదల చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని బీసీలు సభకు తరలి రావాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో వివిధ బీసీ సంఘాల నాయకులు ఉక్కుసూరి గోపాలకృష్ణ, కిలారపు బుజ్జి, ఎ.శివశ్రీ, ఎ.త్యాగరాజాచారి, మల్లిపూడి రాజు, కట్టా శ్రీనివాస్, సర్నాల శివవాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

నిడమర్రు: నిడమర్రు మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ విస్తృతస్థాయి సమావేశం బువ్వనపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమంలో పుప్పాల వాసుబాబు పాల్గొని వచ్చే ఎన్నికల కోసం శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారని పేర్కొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

దెందులూరు: పెదవేగి మండలం న్యాయంపల్లి గ్రామంలో తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జీఎస్ఆర్ చౌదరి గురువారం ప్రారంభించారు. రూ.2 లక్షల వ్యయంతో దీనిని నిర్మించారు.